# అనామిక
## చితికిన మనసు

ఆ గదిలో సన్నని వత్తితో మిణుకు మిణుకుమనే చిన్న దీపమొకటి చీకటిని పారద్రోలడానికి ప్రతిరోజూ ప్రయత్నిస్తూంటుంది. టిక్కు టిక్కు మంటున్న గోడ గడియారం ఒకటి ప్రతీ అరగంటకీ "ఇంకా నిద్రపట్టలేదా?" అని పలకరిస్తూ ఉంటుంది. డబ్భై ఏళ్ళ ముసలితనంలో పార్వతమ్మకి అవి రెండే నేస్తాలు. ఆమెకు ఐశ్వర్యముంది. కొడుకూ కోడలూ, మనవలూ, పాడీ దూడా- అన్నీ ఉన్నాయి. అయినా ఆమె ఏకాకే.

నిద్రరాక గదిలో మంచంమీద అటూ ఇటూ పొర్లుతోంది పార్వతమ్మ. గడియారం పన్నెండు కొట్టింది. ప్రతీరాత్రి ఆమె మనసు బాధల తాలూకు బరువుతో, జ్ఞాపకాల దిగులుతో మూలుగుతూ ఉంటుంది. అయినా ప్రతిసారీ మనస్సుని బుజ్జగించి జోకొట్టి, తాను నానా అవస్థలూ పడి నిద్రకుపక్రమించడం ఆమెకు పరిపాటి. కానీ, ఆ రాత్రి మాత్రం ఆమె మనసు మాట వినిపించుకోవడం లేదు. ఎంత అణుచుకుందామన్నా గుండెల్నిండా వేదన. మనసు గతంవైపుకి పగ్గాలు తెంచుకుని పరిగెడుతోంది.

ఈ డబ్భై ఏళ్ళ జీవితంలో బాల్యం, యవ్వనం, కౌమారం, వృద్ధాప్యం- ఈనాలుగు దశల్లోనూ తను పొందినదేమిటి? ప్రేమమయమయిన తన మనసుకి జీవితం ఎంత చేదు అనుభవాల్ని అందించింది...! జీవితం మొదటి నుంచి చివర వరకూ తన ప్రేమ తత్వాన్ని ఎవ్వరూ గుర్తించలేదు. బాల్యం నుంచీ వృద్ధాప్యం వరకూ అన్నీ ఛీత్కారాలే. కొన్ని జీవితాలు ఆది నుంచో అంతం వరకూ ఒక్కలాగే వెళ్ళిపోతాయేమో! అసలు ఆడదాని జీవితం అంటేనే అంతేనేమో! వెచ్చటి కన్నీటి బొట్లు ప్రక్కలకు జారి తలగడలో ఇంకుతున్నాయి. డెబ్భై ఏళ్ళ జీవితం దశలు దశలుగా ఆమె కళ్ళముందుకు రాసాగింది.

* * *

"పార్వతీ! నీకు చెల్లెలు పుట్టింది."

ఆరేడేళ్ళ పార్వతి గుండె ఈ మాట విని సముద్రం అంత ఎత్తున ఆనందంతో పొంగింది. పార్వతికి చిన్నతనం నుంచీ పిల్లలంటే వెర్రిప్రేమ.

పౌడరద్దడం, గౌను తొడగడం, ఉయ్యాల ఊపడం, రేపట్నుంచి ఎన్నో పనులు తనకి. ఈ బుజ్జి పాపని ఎంతో ప్రేమగా, జాగ్రత్తగా చూసుకోవాలి. తన కిష్టమైన వస్తువులన్నీ- తన కొత్త రిబ్బన్లు, గాజులూ సంతలో కొన్న బొట్టు పెట్టె, అత్తయ్య పంపిన అద్దాల పరికిణీ, పిడత డబ్బీలో దాచుకున్న డబ్బులూ, తీర్థంలో కొనుక్కున్న రాముల వారి బొమ్మా, ఇవన్నీ తనకిష్టమయిన చెల్లెలికే ఇచ్చేయ్యాలి.

రాత్రి పగలూ చెల్లెల్ని గురించే ఆలోచనలు. అందమైన ఆ చెల్లెలి చుట్టూనే మనసంతా పరిభ్రమించడం.

నాలుగు రోజులు పోయాక—

బొద్దుగా ముద్దుగా ఉండే చెల్లిని మెత్తని బొంతల్లోంచి తీసేసి, గరుగ్గా ఉండే గోనెగుడ్డ మీద ఎందుకు పడుకోబెట్టేశారని తను అమాయకంగా అడిగినప్పుడు దొడ్డమ్మ తనని ఒళ్ళో కూర్చోబెట్టుకుని తల నిమురుతూ కళ్ళ నీరు పెట్టుకుంది.


"శత్రువులు మనని ఏడిపించడానికి మనింట్లో అందమైన పిల్లల రూపంలో పుడతారు. కష్టపడి కని, వ్యామోహంతో పెంచబోయే సరికి వాళ్ళకి మన మీద కక్షతీరి, మనకు దక్కకుండా పోతారు."

"ఎక్కడికి పోతారు దొడ్డమ్మా?"

"ఇక్కడ చచ్చిపోయి, మళ్ళీ ఇంకొకళ్ళింట్లో పుడతారు."

ఆ రాత్రంతా నిద్రపట్టలేదు పార్వతికి. ఏదో చెప్పలేని బాధ, ఒంటరితనం. ఆ పసి మనసునిండా కొండంత దిగులు, ఆకాశమంతా చీకటి.

* * *





ఒంటి రెక్క మీద ఇంటి పనంతా చక్క బెట్టుకోలేక చస్తుంటే, బిందె పట్టుకుని ఊరి మీదకి పెత్తనాలకి పోయిందే గాకుండా, పొద్దున్నే ఎవత్తినో చంకనేసుకు మరీ చక్కా వచ్చావ్?" తల్లి నిలదీసింది.

"మన చెల్లే అమ్మా."

"మన చెల్లీ?" "ఓసి దిక్కుమాలిన ముండా! మడిలాగు కట్టుకుని మీతాతకి మంచి నీళ్ళతోడి తెమ్మని బిందిచ్చి పంపితే, ఎవత్తినో చంకనేసుకు మరీ చక్కావచ్చి దాన్ని 'మన చెల్లి' అని ఎంచక్కా భాష్యం కూడా చెబుతున్నావా? నీకెక్కడ దొరికిందే అది? చెబుతావా? వీపు చీరెయ్యనా?"

"మన చెల్లె అమ్మా! మన వెనక వీధిలో కుమ్మర్లులేరూ! అక్కడ సీతమ్మా వాళ్ళింట్లో పుట్టింది. నేను ఎంత అడిగినా వాళ్ళు ఇవ్వనే లేదు. పొద్దుట్నుంచీ ఏడుస్తుంటే సీతమ్మ ఇప్పుడు చిన్న బొంతేసి నా వొళ్ళో కూర్చోబెట్టింది. వాళ్ళు పన్లు చేసుకుంటుంటే నేను చెప్పకుండా మన చెల్లిని ఇంటికి తీసుకొచ్చేశానమ్మా.

అమ్మా అమ్మా. ఇందాకట్నుంచి ఒకటే ఏడుపు, కొంచెం పాలు గిన్నెలోపోసి తాగిద్దామే!" తల్లిచీరకు కుచ్చెళ్ళు పట్టుకుని కుదుపుతూ అడిగింది పార్వతి.

అంత సేపట్నుంచి నిలువుగుడ్లేసి కూతురి మాటలువింటున్న తల్లి బిత్తరపోయి, తేరుకుంది.

"ఓసి నీ మొహం మండిపోనూ? కుమ్మర్ల వీధిలోకెళ్ళి ఆ ముండని మోసుకొచ్చిందే గాకుండా, నన్ను ముట్టుకుని నా మడిగూడా మంటగలిపావు కాదుటే, ముదనష్టపుదానా!"

పార్వతి రెండో చేతిలో ఉన్న రాగి బిందెని లాక్కుని "ఠంగు" మని గిద్దెకు రక్తం చిమ్మేలా మొట్టింది తల్లి.

"ఈ స్నానాలతోనే నేనేవాతమో వచ్చి వచ్చేట్టున్నాను. అప్పుడే ఇది మూడోసారి. వెళ్ళి ఆ దొమ్మరపీనుగని వాళ్ళింటి దగ్గర దించిరా. ఆ బట్టలతో లోపలికి రాకు, మీ తాత కాల్చి వాతలేస్తాడు. తిన్నగా నూతి దగ్గరకి తగలడు. నీ మీద కూడా నాలుగుచేదల నీళ్ళు దిమ్మరిస్తాను జేష్ట పీనుగా!"

కళ్ళనిండా నీళ్ళు చిమ్మాయి పార్వతికి. అమ్మ బిందతో తలబద్దలుకొట్టినందుకు కాదు. కష్టపడి తిరిగి తెచ్చుకున్న చెల్లెల్ని ఎక్కడో దిగబెట్టేసి రమ్మన్నందుకు.

తర్వాత కొన్నేళ్ళకి పార్వతి ఎదిగింది. జ్ఞానం వచ్చింది. మన పిల్లలు ఇంకొకరింట్లో పుడతారో లేదో తెలియదు గానీ, ఇంకొకరింట్లో పుట్టినపిల్లలు మనో పిల్లలవ్వరని తెల్సింది. తర్వాత కొన్నేళ్ళకి నిజంగానే చెల్లెలూ తమ్ముడూ పుట్టారు పార్వతికి. కానీ అప్పటికే ఆమెకు పెళ్ళయిపోయింది. తొమ్మిదేళ్ళ పార్వతి ముప్పై ఎకరాలకి వారసుడైన పధ్నాలుగేళ్ళ రోగిష్టివాడికి భార్య అయ్యింది. పిల్ల సుఖపడుతుందన్న దృష్టితో తండ్రి గొప్పింటి సంబంధం చేశాడు. అత్తమామల హయాంలో, పూటకి పాతికవిస్తళ్ళు లేచే కామాటంలో, గుండిగలెత్తి దింపడానికే ఖాళీ లేనంత సంసారంలో, ఆమె ఎప్పుడూ తోబుట్టువులనెత్తి ముద్దాడడానికి పుట్టింటికి వెళ్ళడానికే నోచుకోలేదు.

* * *

పార్వతిని కాలం పార్వతమ్మగా మార్చింది.

ఇరవై ఎనిమిదేళ్ళ పార్వతమ్మ గడపలో నించుని కన్నీరు కారుస్తోంది. ఇన్నేళ్ళొచ్చినా తనకు పిల్లలులేరని మొగుడు రెండో పెళ్ళికి సిద్ధపడుతున్నాడు. ఇక వివాహబంధానికి విలువేముంది? ముద్దబంతి పువ్వు లాంటి తనని చీడపురుగు లాంటి రోగిష్టి మొగుడికిచ్చి చేశారనైనా మనసులో అనుకోకుండా ప్రేమతో, జాలితో, మంచం మీద కూర్చోబెట్టి చేతులరిగిపోయేలా సేవ చేసినందుకు- ప్రేమాభిమానాల మాట దేవుడెరుగు, కించిత్తు విశ్వాసమైనా లేకుండా దిక్కూలేని దాన్ని చేసి పుట్టింటికి గెంటేయడానికి సిద్ధమవుతున్నాడు.

మానవ ప్రకృతి ఎంత విచిత్రమైనది! నిస్సహాయురాలైన పార్వతమ్మ భగవంతుణ్ణి తల్చుకుని కన్నీరు కార్చడం మినహా ఏమీ చేయలేకపోయింది.

పార్వతమ్మ భర్తకి కొన్ని సంబంధాలు వచ్చాయి. ఈ క్షణం బాగుంటే మరుక్షణానికి రోగ మొచ్చి బిగుసుకుపోయే అనారోగ్యం మనిషికి తెగించి పిల్లనిస్తే వైధవ్యంతో గొంతు కోసి మళ్ళీ పుట్టింటికి చేర్చడమే అవుతుందని భావించి కొందరు వెనక్కు తగ్గారు. పెళ్ళయిన వాడికి పిల్లనిస్తే వైధవ్యం సంప్రాప్తించినా, మొదటి భార్య ఉండగా, సుఖించి తినడానికి తగినంత ఆస్తయినా రాదేమోననే సందేహంతో మరి కొందరు మహానుభావులు జంకారు.

ఈ మధ్య వ్యవధిలో ఏ భగవంతుడు ఆమె కన్నీటికి కరిగాడోగానీ, పార్వతమ్మకి ఏడాది తిరగకుండా ఓ కొడుకు పుట్టాడు. వైద్య విజ్ఞానం పరిణతి చెందిన ఆ రోజుల్లో, ఓ మోటు వైద్యుడిచేతిలో, సిజేరియన్ ఆపరేషన్ ఫలితంగా పుట్టిన ఆ కొడుకువల్ల పార్వతమ్మకి చావు తప్పి కన్ను లొట్టపోయినంత పనై ఆరోగ్యం క్షీణించిపోయింది.

లేక లేక పుట్టిన ఆ కొడుకే పార్వతమ్మకి జీవితం. వాడంటే ఆమెకు పంచప్రాణాలు. వాడు ఆడిందే ఆట. పాడిందే పాట. వాడు పుస్తకంతో 'కా'ని చూసి 'కి' అంటే చదువు చెప్పే పంతులు గారు కూడా ఆహాహా! అది 'కి' యే సుమండీ! అని ఒప్పుకుని ఆనందించవల్సిందే. వాడి ఇష్టాలు తీర్చడానికి అష్ట కష్టాలూ పడి, వాణ్ణి ఎంతో గారంగా పెంచింది పార్వతమ్మ. వాడి కోసమే తన మిగిలిన

## అదేవల్ల కావడంలేదు

"నీవు సౌర్యం కాదనుకొంటున్నదేమిట్రా?" అన్నాడు రాము తన మిత్రుడు సోముతో.

"మా ఆవిడ నా వంట బావుందనడం" అన్నాడు సోము బాధపడుతూ.

_యం. గణేశ్వరరావు

విజయనగరం


## పెళ్లి పల్లకి

* సొంత వ్యాపారం చేసుకుంటూ, ఇద్దరు పిల్లలున్న 37 సంవత్సరాల వ్యక్తికి ద్వితీయ వివాహానికై ఆదర్శభావాలు కల వధువు కావాలి. కులం, మతం ప్రసక్తి లేదు. పునర్వివాహమైనా పర్వాలేదు. బాక్సు నెం. 104.





## జ్యోతిషం

* ఆశలు, ఆకాంక్షలు మీ అభివృద్ధికి సోపానాలు. ఆధునిక శాస్త్రీయ పద్ధతులలో మీ భవిష్యత్తును తెలుసుకోవడానికి ఎస్ట్రొలాజికల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్, 13, జర్నలిస్టు కాలనీ, హైదరాబాద్ 34కు రాయండి. ఫోన్ నెం. 38570.

జీవితమంతా ఆనందంగా ధారపోసింది కూడా.

వాడు పెరిగి పెద్దవాడై, పెద్ద చదువులు చదివాడు. పెళ్ళి అయ్యింది. పిల్లల తండ్రి అయ్యాడు. కాలం ఎన్నో మార్పుల్ని తెచ్చింది. ఈ మధ్య కాలంలో పార్వతమ్మ భర్త గతించాడు. భర్తకు ప్రతిరూపమైన కొడుకు తన తల్లి గుండెల్లోని ప్రేమను గుర్తించలేదు. ఆమెను తల్లిగా ఎప్పుడూ ప్రేమించి గౌరవించనూలేదు.

ఫలితం- తన కున్న ఆస్తితో, తన వాటా గదిలో తన గంజి తానే కాచుకుని తాగుతూ, ఏకాకిలా జీవితం నెట్టుకొస్తోంది పార్వతమ్మ. ఆమె వాకిలిలోకి వంగి వాలేవాళ్ళూ, తొంగి చూసేవాళ్ళూ ఎవ్వరూలేరు.

రోజులో ఎప్పుడయినా రెండు మూడు సార్లు పసిపిల్లలైన మనవలు వాళ్ళ వాటాలోంచి వచ్చి, కాచిననెయ్యితో చేసిన సున్నుండలూ, అరిసెలూ తినేసి, జేబుల్నిండా డబ్బులడిగి పట్టుకుపోతూ ఉంటారు. ఆ పసిపిల్లలతో ఉన్న బంధం, సంబంధం అంతవరకే.

పార్వతమ్మ మనసు బాధతో మూలిగింది. చిన్నప్పట్నుంచి చాకిరీ... చాకిరీ... చాకిరీ... తన గుండెల్లోని ప్రేమనెవ్వరూ గుర్తించలేదు.

యంత్రంలాంటి కన్నతల్లి- మడిబట్టకట్టుకుని మంచినీళ్ళు తోడడానికీ, ఇళ్ళూ, వాకిళ్ళూ పొయ్యిలూ అలికి శుద్ధి చెయ్యడానికీ, కాలువ కెళ్ళి "మడికి పనికొచ్చేలా మసి లేకుండా మిలమిలా మెరిసిపోయేలా అంట్లుతోమి తేవడానికే-" కేవలం తను పుట్టాననుకుంది.

కట్టుకున్న భర్త- తనని మంచంమీద కూర్చోబెట్టి, మలమూత్రాలెత్తడానికీ, మందులందియ్యడానికీ, వండి వడ్డించడానికే కేవలం తనను పెళ్ళాడాననుకున్నాడు.

ఇప్పుడు ఆఖరికి కన్నకొడుకు- కష్టపడి పెంచడానికీ, ఆస్తీ అంతస్తూ అందివ్వడానికే, కేవలం తనను కన్నాననుకుంటున్నాడు.

ఎంత విచిత్రం! తన జీవితంలో మూడు తరాల్ని చూసింది. ఏ ఒక్క తరమూ తనని మనిషిగా గుర్తించలేదు. నిస్వార్థమైన తన ప్రేమనీ, సేవనీ, కనీసం ఆదరించలేదు. ఇన్నేళ్ళ జీవితంలో ఏ ఒక్కరైనా "పార్వతమ్మా, నువ్వు అన్నం తిన్నావా? కులాసాగా ఉన్నావా?" అని అడుగుతారేమోనని ఎంతో ఆశతో ఎదురు చూసింది. ఫలితం... శూన్యం. కొన్ని జీవితాలు ఎంతమంది మధ్య పుట్టినా, ఎంత ఐశ్వర్యంలో మునిగి తేలినా, ఏకాకిగా గడిచి ఏకాకిగానే ముగిసిపోతాయి. కొవ్వొత్తిలా నిలువుగా కరిగి నీరై పోయి జీవితం సర్వస్వం ఇతరులకర్పించినా, చచ్చిపోతే ఒక్క కన్నీటి బొట్టు రాల్చేవాళ్ళు కూడా ఉండరు. ఎవరి కోసం బతకాలి?

పార్వతమ్మకు దుఃఖం కట్టలు తెంచుకుంది.

వెక్కి వెక్కి ఏడ్చింది. కళ్ళు వాచాయి. ముఖం బరువెక్కింది. అలసటగా అటూ ఇటూ పొర్లి కళ్ళుమూసుకోవడానికి ప్రయత్నించింది.

గాలికి కిటికీ తలుపులు తెరుచుకున్నాయి. ఆ అలికిడికి కళ్ళుతెరిచిచూసింది. కిటికీలోంచి పల్చటి వెలుగు గదిలోకి వచ్చి పడుతుంటోంది. కొబ్బరిచెట్టు మీద కాకులు కలకలం చేస్తున్నాయి. దూరంగా కోడి కూస్తోంది. అప్పుడే తెల్లారిపోతున్నట్టుంది.

బద్ధకంగా మూలిగింది. ఆమెకు ఎవ్వరూ లేరు. కానీ ఆమె అందరికీ ఏవిధంగా కావాలి. తను లేవాలి, తప్పదు. బోల్డు పనులున్నాయి. లేచి చూడకపోతే పాలేరు దొడ్లో పాలు దొడ్లోంచే అమ్మేసుకుని చెంబునిండా నీళ్ళు కలిపి ఇంట్లోకి పట్టుకొస్తాడు. పిల్లలచేత తాను రోజూ పంపే గడ్డ పెరుగుతో సుష్టుగా భోజనం చేసే కొడుకు, పెరుగు పల్చనయితే ఒక్క ముద్దకూడా తినడు. ఆవురావురుమంటూ కాఫీలకోసం మనవలు తెల్లారకుండా వచ్చి కుంపటి చుట్టూ చేరతారు.

ఈ వేళ అప్పుడే ఫస్టు తారీకు గాబోలు. ఇళ్ళ అద్దెలు మనిషిని పంపి వసూలు చేయిస్తేనేగానీ పిల్లల చిల్లర ఖర్చులకివ్వడానికి చేతిలో నయాపైసా కూడా ఉండదు.

ఒళ్ళు విరుచుకుని ఎంతో ప్రయత్నంమీద మంచం మీంచి లేచింది.

కుంపటి చుట్టూచేరిన మనవలు పార్వతమ్మ పోసిన వెండి గ్లాసుల్లోని కాఫీలో బ్రెడ్ ముక్కలు నంచుకుని తింటూ, ఇంకా ఒకళ్ళ చేతిలోని ముక్కలకోసం మరొకళ్ళు దెబ్బలాడుకుంటున్నారు. ఆఖరి వాణ్ణి దగ్గరికి పిల్చి ముంగురులు సరిదిద్ది, ఒళ్ళో కూర్చోబెట్టుకుంది. వాడు కూర్చున్నాక "ఒరే కన్నా! నాకో చిన్ని ముక్క పెట్టవూ?" రెండు బుగ్గలమీదా ముద్దులు పెట్టుకుంటూ మురిపెంగా అడిగింది. ఒళ్ళో కూర్చున్న వాడు, ఉంగరాల జుట్టులోంచి చక్రాల్లాంటి కళ్ళు పైకెత్తి ఓసారి నాన్నమ్మ ముఖంకేసి చూశాడు.

"అమ్మా! ఇదినాదీ, నేపెట్టను, అయినా యీ బెడ్డు నీదేంటి? మా నాన్న మాకు కొని తెచ్చాడు గానీ..."

వాడు చటుక్కున ఒళ్ళోంచి జారి, గ్లాసులో ఉన్న కాఫీ గడగడా ఎత్తి తాగేసి, బ్రెడ్ పొట్లం తనరెండు బుల్లి చేతులతోనూ గట్టిగా పట్టుకుని వాళ్ళ వాటాలోకి పారిపోయాడు.

పిల్లలు పరమాత్మ స్వరూపానికి ప్రతిరూపాలు. ఏ గూటి చిలక ఆ గూటి పలుకే పలుకుతుంది. వాళ్ళను తప్పుపట్టి ప్రయోజనమేముంది? భారంగా నిట్టూర్చింది పార్వతమ్మ. వసారాలో కూర్చున్న ఆమె దృష్టి ఓ చోట ఆగి నిలిచింది.

అక్కడ-వసారా అవతలి గుమ్మంలోంచి కుంటికుక్క తనను చూసి, తోకాడిస్తూ నిలబడి ఉంది. అది వీధి కుక్క. ఓసారి బస్సుకింద పడి కాలు విరగ్గొట్టుకుంటే తను చూసి జాలి పడి, ఓ నాలుగు రోజులు వరసగా పాలు పోసింది.

అంతే! అప్పట్నుంచీ తన యిల్లు దాటి బయటికి పోనేలేదది. లంకంత ఇంటికీ కాపలా కాస్తూ, తను అన్నం తినేదాకా వంటింటి అవతల కూర్చుని చూస్తూ-విశ్వాసంగా తోకాడిస్తూ ఉంటుంది. దేనికోసమూ కలియబడదు. పట్టెడన్నం పెడితే తింటుంది. లేకపోతే కాళ్ళు ముడుచుకుని పడుకుంటుంది. తనపట్ల దానిగుండెల్లో దాగి ఉన్న విశ్వాసం, ఆ కళ్ళల్లోంచి కొట్టొచ్చినట్టు కనబడుతూ ఉంటుంది.

మనిషికీ, జంతువుకూ ఎంత తేడా?

దాన్ని దగ్గరకు పిలిచి పళ్ళెంనిండా పాలు పోసి, తృప్తిగా నిట్టూర్చింది వెర్రితల్లి..... పార్వతమ్మ. *



50 సంవత్సరాల గొప్ప అనుభవం గల డా॥ యస్. లక్ష్మీమూర్తి గారి, చర్మ వ్యాధుల హాస్పిటల్, శీతయ్యగారితోట, పిఠాపురం-533450.

అన్ని రకముల చర్మవ్యాధులు, మచ్చలు, పొడలు, సొరియాసిస్, రసిపుండ్లు, సుఖవ్యాధులు, సమస్త దీర్ఘ వ్యాధులు, దాంపత్య సుఖం లేనివారికీ, సంతానం లేకపోవుట, నూతన శక్తి యవ్వనమునకు దేశ ప్రఖ్యాతి గాంచిన 50 సంవత్సరాల గొప్పఅనుభవ సిద్ధాయుర్వేద చికిత్సచే. నమ్మకమైన వైద్య సేవ. త్వరపడుడు. పోస్టు ద్వారా చికిత్స కలదు.

క్యాంపులు : ప్రతీ మంగళవారం గుడివాడ — గులాబ్‌చంద్ వారి పెట్రోలు బంకు ప్రక్కన వున్న బ్రాంచీకి, ప్రతీ శుక్రవారం రాజమండ్రి-కుమారి టాకీసు దగ్గర వున్న బ్రాంచీకి క్యాంపు వచ్చెదరు.